# ప్రైవేటు ప్రయోగానికి ఖరారు కాని సమయం




## షార్‌లో ప్రైవేటు సంస్థ బృందం

శ్రీహరికోట (తడ), నవంబర్ 10 ప్రభాతవార్త

శ్రీహరికోట నుంచి తొలి ప్రైవేటు రాకెట్ ప్రయోగానికి ఇంకా సమయం ఖరారు కాలేదు. షార్‌లోని సౌండింగ్ రాకెట్ కాంప్లెక్స్ నుంచి విక్రమ్ ఎస్ పేరుతో ఈ 'ప్రథమ్' ప్రయోగాన్ని జరపనున్నారు. మొదట ఈ నెల 12న ఉదయం 11 గంటలకు రాకెట్‌ను ప్రయోగించడానికి సిద్ధమయ్యారు. అయితే 16వ తేదీ వరకు అవకాశం ఉంది. ప్రస్తుతం షార్ సమీప ప్రాంతాల్లో కూడా వాతావరణం సరిగా లేని కారణంగా ప్రయోగ సమయాన్ని నిర్ధారించలేదు. గురువారం కూడా ఉరుములు మెరుపులతో కూడిన జల్లులు కురిశాయి. హైదరాబాద్‌లోని స్కై రూట్ సంస్థ ఇస్రో కాకుండా తొలి ప్రైవేటు రాకెట్‌ను తయారు చేసింది. ఇస్రో ఆధ్వర్యంలో భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రం శ్రీహరికోట నుంచి దీన్ని ప్రయోగిస్తున్నారు. ఇందులో మూడు పేలోడ్‌లను అమర్చి భూమికి అతి తక్కువ కక్ష్యలో ప్రవేశపెట్టనున్నారు. ఇందుకు సంబంధించి స్కై రూట్ ప్రతినిధులు ఇప్పటికే షార్‌ను చేరుకొని ఇస్రో శాస్త్రవేత్తలతో కలిసి ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. ఈ ప్రైవేటు రాకెట్ తర్వాత మరో ఐదు పీఎస్ఎల్‌వీ రాకెట్లను సొంతంగా రూపొందించడానికి రెండు సంస్థలు ఇస్రోతో ఒప్పందం కుదుర్చుకొని ఉన్నాయి.

# తిరుపతి - చిత్తూరు




# ఒంటరి ఏనుగు హాల్‌చల్



రోడ్డు దాటి అటవీ ప్రాంతంలోకి వెలుతున్న ఏనుగు

పలమనేరు, నవంబర్ 10 ప్రభాతవార్త:

పలమనేరు మండలంలోని జగమర్ల వద్ద ఓ ఒంటరి ఏనుగు హాల్ చల్ చేస్తూ ప్రయాణికులను భయభ్రాంతులకు గురిచేస్తుంది. గత కొంత కాలంగా ఏనుగుల గుంపులో నుండి ఒంటరైన ఓ ఎనుగు స్థానిక గాంధీనగర్, జగమర్ల, బంగారుపాళ్యం అటవీ సమీప ప్రాంతాలలో సంచరిస్తుంది. అనునిత్యం జాతీయ రహదారికి ఇరువైపుల ఉన్న అటవీ ప్రాంతాలకు రోడ్డు దాటుతూ వాహనదారులను హడలెత్తిస్తుంది. ఇటీవల ఆ ఒంటరి ఏనుగు రోడ్డు దాటుతున్న సమయంలో ఓ కారు ఢీకొంది. దీంతో ఏనుగుకు స్వల్పగాయాలు కాగా కారు పాక్షికంగా దెబ్బతినగా ప్రయాణికులకు గాయాలుకావడం జరిగింది. అధికంగా ఉదయం, రాత్రి సమయాలలో ఈ ఏనుగు రోడ్డు దాటుతూ కనిపిస్తుండడంతో అటువైపు ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. అనునిత్యం రోడ్డుపై ఏనుగు హాల్ చల్ చేయడంతో సాయంత్రం సమయంలో పనులు ముగించుకుని సమీప గ్రామాలైన గాంధీనగర్, జగమర్ల వేళ్ళే ప్రజలు ప్రాణాలను అరచేత పట్టుకుని ప్రయాణాలు చేస్తున్నారు. ఇప్పటికైన సబందిత అధికారులు స్పందించి ఆ ఒంటరి ఏనుగును కట్టడి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## పొలాలపై గజరాజుల దాడులు



ఏనుగులు ధ్వంసమైన చెరకుతోటను పరిశీలిస్తున్న అధికారులు

సదుం నవంబరు 10ప్రభాతవార్త

మండల పరిదిలోని చెరకువారిపల్లె పంచాయతీలో గురువారం ఉదయం ఏనుగుల మంద పంటపొలాలపై దాడి చేసిందని గ్రామస్థులు తెలిపారు. పోతుంవారిపల్లె గ్రామానికి చెందిన ధనంజయ, హేమ ప్రసాద్ అనే రైతులు తమ పొలాల చుట్టు వేసుకున్న ఇనుప కంచెను తొక్కి పడేశాయి. అక్కడి నుంచి అరటి పంటపై దాడి చేసి తిన్నాయి. అనంతరం ఎకరా మేర నాటుకున్న చెరకు పంటను తిన్నాయి. వీటితో పాటు వారు వేసుకున్న రేకులషెడ్డును పడగొట్టాయి. ఉదయం పొలాల వద్దకు వెళ్లిన రైతులు దెబ్బ తిన్న పంటను చూసి లబోదిబో మన్నారు. అధికారులకు పిర్యాదు చేశారు. వీఆర్వో పురుషోత్తం, సచివాలయ ఉద్యోగులు వెళ్లి పంటలను పరిశీలించారు. వివరాలు నమోదు చేసుకున్నారు. దాదాపు 8 నుంచి 10 ఏనుగుల వరకు ఉండవచ్చునని గ్రామస్థులు తెలిపారు.

# చినుకు కోసం ఎదురుచూపు

## ముఖం చాటుతున్న రుతుపవనాలు: ఆశలన్నీ తుఫాన్లపైనే

శ్రీకాళహస్తి, నవంబర్ 10 ప్రభాతవార్త

తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాలు ధాన్యాగారాలుగా ఉన్నాయి. అయితే ఈ ప్రాంతాల్లో సుమారు 450 చెరువులున్నాయి. అన్ని రాజుల కాలంలో నిర్మించినవే. అయితే వాటి నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది. ఉపాధి హామీ పథకంలో పనులు జరుగుతున్నట్లు రికార్డుల్లో నమోదౌతుంది. కానీ ఎక్కడ ఏం జరిగిందో ఏం జరుగుతుందో ముక్కంటీశునికే ఎరుక. అయితే సాధారణంగా ఈ ప్రాంతాల్లో ఈశాన్య రుతుపవనాల ద్వారా భారీ వర్షాలు కురుస్తాయి. అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు సుమారు 1500 మి.మి ల వర్షపాతం నమోదౌతుంది. పదేళ్ళ క్రితం పరిస్థితి పరిశీలిస్తే 2వేల మి.మీల నమోదయ్యేది. కానీ వాతావరణంలో మార్పులో లేక ప్రకృతి కక్ష బూనిందో కానీ 'రుతుపవనాల ద్వారా' వర్షాలు ప్రశ్నార్థకమయ్యాయి. కేవలం 'తుఫాన్లు, అల్పపీడనం'పైనే ఆధారపడి చెరువులు నింపుకునే దుస్థితి చోటు చేసుకుంది. ఈ ఏడాది వర్షాలు అన్నదాతలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఈ ప్రాంతంలో సాధారణ సగటు వర్షపాతం గమనిస్తే అక్టోబర్‌లో 230 మి.మీలు కాగా ఈ ఏడాది కేవలం 86 మి.మీలు మాత్రమే నమోదైంది. ఇక నవంబర్ సాధారణ సగటు వర్షపాతం శ్రీకాళహస్తిలో 330.3, తొట్టంబేడులో 330.4మి.మీలుగా ఉంది. నవంబర్ మాసంలో పది రోజులు గడిచిపోయాయి. కానీ ఇప్పటి వరకు శ్రీకాళహస్తిలో కేవలం 105.4 మిమీల వర్షపాతం, తొట్టంబేడు మండలంలో 108.8మి.మీ వర్షపాతం మాత్రమే నమోదైంది.

### వరుణుని కరుణ కోసం చెరువులు నిరీక్షణ:

శ్రీకాళహస్తి ఇరిగేషన్ సబ్‌డివిజన్‌లో 452 చెరువులున్నాయి. వీటి కింద సుమారు 32వేల హెక్టార్లలో పంటలు పండిస్తున్నారు. ఈ చెరువులు నవంబర్ నాటికి నీటితో కళ కళ లాడాల్సి ఉంది. స్వర్ణముఖి నది కనీసం రెండు సార్లు పారాల్సి ఉంది. కానీ ఈ ఏడాది ప్రకృతి వైపరీత్యమో ఏమో కాని ఇప్పటి వరకు స్వర్ణముఖి పారలేదు. చెరువులకు కనీసం నీటి ముఖం చూపలేదు. ఈ ప్రాంతాల్లో రబీ సీజన్ నవంబర్ మొదటి వారం నుంచే ప్రారంభం అవుతుంది. అయితే ఈ ఏడాది వర్షాభావంతో అన్నదాతలు



వరుణుని కరుణ కోసం ఆకాశం వైపు ఎదురు చూస్తున్నారు. నవంబర్‌మాసం సగం కావస్తున్నా సరైన వానలు లేకుంటే ఈ ఏడాది వ్యవసాయం ఎలా చేయాలనే మీమాంశలో కొట్టుమిట్టాడుతున్నారు.

### తుఫానుపై గంపెడాశలు:

మొదటి వారంలో బంగాళాఖాతంలో తమిళనాడు సమీపంలో ఏర్పడిందని ప్రకటించటంతో రైతుల్లో ఆనందోత్సాహాలు వెల్లి విరిసాయి. అయితే ఆ తుఫాను వల్ల కనీసం వర్షం కూడా కురవలేదు. దాంతో నిరాశ చెందారు. ప్రస్తుతం మళ్ళీ తుఫాను ప్రకటనతో ఈ తుఫాను అయినా చెరవుల్ని నింపుతుందా? వ్యవసాయం సాగించవచ్చా? అనే గంపెడాశతో ఎదురు చూస్తున్నారు. గురువారం ఉదయం నుంచి ఆకాశం మేఘావృతం కావటంతో రైతుల కళ్ళలో ఆశల వెలుగులు కనబడుతున్నాయి.

'గడప గడపకు-మన ప్రభుత్వం' వినతులను

# నిర్దేశించిన సమయానికి పూర్తిచేయాలి

**- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీర్ శర్మ**



తిరుపతిరూరల్, నవంబర్ 10 ప్రభాతవార్త:

గడప గడపకు – మన ప్రభుత్వం కార్యక్రమానికి వచ్చిన వినతులను నిర్ధేశించిన సమయానికి పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యధర్శి సమీర్ శర్మ కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లను ఆదేశించారు. గురువారం అమరావతి నుండి రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యకార్యధర్శి సమీర్ శర్మ వర్చువల్ విధానం ద్వారా సమీక్షించారు. జిల్లా కలెక్టర్ వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ నవ రత్నాలు – పేదలందరికి ఇళ్ల పథకంలో భాగంగా జగనన్న కాలనీలో ఇళ్ళ నిర్మాణాలను వేగవంతం చేయాలని తెలిపారు. హౌసింగ్ లే అవుట్‌లలో అన్ని మౌళిక వసతులు కల్పించి, నిర్ధేశించిన గడువులోపల పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. స్పందన వినతులను ఆన్‌లైన్‌లో ఫోటో అప్‌లోడ్ చేయాలని, బియాండ్ ఎస్.ఎల్.ఏ.కి వెళ్ళకుండా చర్యలు చేపట్టాలన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంజూరు కాబడిన పనులను వేగవంతం చేయాలన్నారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధనంగా వాలంటీర్‌లు, ఆశా వర్కర్లు, ఏ.ఎన్.ఎం.లు ప్రత్యేక శ్రద్ధ వహించి, నిర్ధేశిత 8 ఇండికేటర్‌లు, 4 పారా మీటర్లవారీగా రక్త హీనత, పోషక ఆహార లోపం లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. గర్భిణీలకు, బాలింతలకు, కౌమారదశ అమ్మాయిలకు అనీమియా తగ్గించుట, పౌష్టిక ఆహారం, ఐరన్ మాత్రలు అందేలా వైద్య, మహిళా శిశు సంక్షేమశాఖ, డి.ఇ.ఓ. సంక్షేమ శాఖల అధికారులు చర్యలు తీసుకొని, పురోగతి చూపాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, సంక్షేమ హాస్టల్స్‌పై పర్యవేక్షణ ఉండాలని సూచించారు. ఈ-బిసి నేస్తంకు సంబంధించిన పనులను పూర్తి చేయాలన్నారు.

ప్రధాన మంత్రి అవాస యోజన పథకం కింద గ్రామీణ గృహ నిర్మాణాలను వేగవంతం చేయడంతో పాటు రిజిస్ట్రేషన్, గ్రౌండింగ్ పూర్తి చేసి ఋణాలు మంజూరయ్యేలా చూడాలన్నారు. రీ సర్వేపై దృష్టి పెట్టాలని, త్వరితగతిన పూర్తి చేయాల న్నారు. సమావేశంలో సర్వే ఏడి జయరాజ్, జిల్లా ప్లానింగ్, స్టాటిస్టికల్ అధికారి అశోక్ కుమార్, డిఎల్‌డిఓ సుశీలాదేవి, డిఇవో శేఖర్, మహిళ శిశుసంక్షేమ శాఖ అధికారిణి జయలక్ష్మీ, హౌసింగ్ డిడి చంద్రశేఖర్‌బాబు, మెప్మా పి.డి రాధమ్మ రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణుల సౌకర్యం కొరకే

# బస్సు ప్రారంభం

## డిప్యూటీ సీఎం నారాయణస్వామి



వెదురుకుప్పం, అక్టోబర్ 10 ప్రభాతవార్త :

గ్రామీణ ప్రాంతం ప్రజలకు రాకపోకల సౌకర్యం కల్పించడంకు కొరకే నూతన బస్సుప్రారంభించామని రాష్ట్ర డిప్యూటీ సీఎం నారాయణస్వామి పేర్కొన్నారు. మండలంలోని తిరుమలయ్యపల్లె పంచాయితీ పరిధిలోని మాకమాంబపురం రహదారిలో చిత్తూరు రెండవ డిపోకు చెందిన నూతన సర్వీస్సును జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా కాలంగా మంచి రోడ్డు వసతిలేక తిరుపతి, చిత్తూరు, పుత్తూరు పట్టణాలకు వెదురుకుప్పం మండల పరిధిలోని దిగువపల్లాలు, ఆళ్ళమడుగు, సోమేంద్రపురం, శ్రీరంగరాజపురం మండలంలోని మంగుంట, కార్వేటినగరం మండలం పరిధిలోని జాండ్లపేట ప్రజలు ఇబ్బందులు పడేవారన్నారు. రైతులు పండించిన పంటలకు మార్కెట్టుకు తరలించాలన్న, అత్యవసర సమయంలో ఆసుపత్రికి రోగులను తరలించాలని కష్టలు పడేవారని ప్రజల సౌకర్యం కొరకు ఆ గ్రామాలను కలుపుతూ నూతనంగా బస్సు సౌకర్యం కల్పించడం జరుగుతుందన్నారు. ప్రజలు బస్సుసర్వీస్సును సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. అనంతరం 4.87 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన రోడ్డును ప్రారంభించారు. అంతకుముందు ఉమ్మడి చిత్తూరు జడ్పీచైర్మెన్, గంగాధర నెల్లూరు నియోజకవర్గం పరిశీలకుడు శ్రీనివాసులు(వాసు)కు ఘనంగా స్వాగతం పలికి దుశాలువ, ఘజమాలతో సన్మాంచారు. ఈ కార్యక్రమంలో ఏపిఎస్ఆర్‌టిసివైఎస్ ఛైర్మెన్ యంసీ, విజయానంద రెడ్డి, జడ్పీటిసి సుకుమార్, ఎంపీపీ నాగరాణి, తిరుమలయ్యపల్లె సర్పంచ్ భారతి, వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండి హేమసురందర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి కామసాని పద్మనాభ రెడ్డి, నాయకులు దామోదరం రెడ్డి, చిన్నస్వామి, రోసు రెడ్డి, ఎంపిడివో సుధాకర్‌రావు, తహాశీల్ధార్ పుల్లా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల చెంతకు ఫ్రెండ్లీ పోలీస్ : ఎస్పీ

బంగారుపాళ్యం, నవంబర్ 10 ప్రభాతవార్త:

ప్రజల చెంతకు స్నేహపూరిత పోలీస్ వ్యవస్థను తీసుకువస్తున్నామని ఎస్పీ రిశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ రిశాంత్‌రెడ్డి తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలించి ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన పోలీసు సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రజల నుండి ఏ సమస్య వచ్చినా ముందుగా పోలీసులు స్పందించి పరిష్కరించడానికి కృషి చేయాలన్నారు. సచివాలయంలోని మహిళా పోలీసులు, వాలంటీర్ల సహకారంతో గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. ఫోక్సో చట్టం, ఛీటింగ్, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించి చైతన్యం తీసుకురావాలన్నారు. మహిళా పోలీసులు ఇచ్చిన నివేదికలపై రిజిస్టర్ల నందు నమోదు చేసి సమీక్ష చేయాలన్నారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాల నియంత్రణకు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. రహదారుల్లో తరచు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. రాత్రి నందు గస్తీ నిర్వహించి దొంగతనాలు జరుగకుండా చూడాలని చెప్పారు. అలాగే డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో ఎవరికి ఎలాంటి మినహాయింపులు ఇవ్వరాదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలమనేరు డిఎస్పీ సుధాకర్‌రెడ్డి, ఎస్‌బి డిఎస్పీ శ్రీనివాసులురెడ్డి, స్థానిక సిఐ నరసింహారెడ్డి, ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బంగారుపాళ్యం పోలీస్ స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎస్పీ రిశాంత్‌రెడ్డి.

# ఇంట గెలిచి రచ్చ గెలుస్తారా!?

## తిరుపతి టిడిపిలో వినిపించని ఐక్యతారాగం !!



ప్రభాతవార్త–తిరుపతి:

"చెవిలోని ఈగ ఇంటిలోన పోరు" ఇంతింతకాదయా..."అనే చందంగా తిరుపతి నియోజకవర్గంలో తెలుగుదేశం నాయకుల పరిస్థితి విభిన్నంగా తయారైంది. పార్టీని బలోపేతం చేసుకుని, ఎన్నికల్లో గెలవడమే ధ్యేయంగా పనిచేయాలని అధినేత చంద్రబాబునాయుడు ఘాటుగా హెచ్చరిస్తున్నా కొందరు నేతలు పెడచెవిన పెడుతున్నారనే వాదన పార్టీశ్రేణుల్లో వినిపిస్తోంది. పార్టీని నమ్ముకుని పార్టీకోసం పనిచేస్తున్న నాయకులను కాదని ఇతర పార్టీల నుంచి వలసవచ్చిన వారికి, అవకాశం కోసం పార్టీ కండువాలు మార్చే వారిని అందలం ఎక్కించాలంటే పార్టీ దిగజారుడేనని కార్యకర్తలు బాహాటంగానే విమర్శిస్తున్నారు. ప్రస్తుతం తిరుపతి నియోజకవర్గంలో ఇన్‌ఛార్జిగా మన్నూరు సుగుణమ్మ కొనసాగుతున్నారు. ఆమె తన భర్త దివంగత ఎమ్మెల్యే ఎం.వెంకటరమణ తరువాత రాజకీయప్రవేశం చేశారు. 2015 మధ్యంతర ఎన్నికల్లో తిరుపతి అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందారు. అప్పట్లో ఎమ్మెల్యేగా ఆమె పార్టీలో కార్యకర్తలను, నాయకులను కలుపుకుని పనిచేసినా ,అరకొర తప్పిదాలు, అసంతృప్తులను పట్టించుకోలేదు. ఓ వైపు సొంత పార్టీలోనే ఆమె వ్యతిరేకత చవిచూడాల్సిన పరిస్థితి ఎదురైంది. ఆటుపోట్లను ఎదుర్కొని 2019 ఎన్నికల్లో తిరుపతి అభ్యర్థిగా మళ్ళీ సీటు దక్కించుకున్నా వైసిపి అభ్యర్థి, ప్రస్తుత సిట్టింగ్ ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి చేతిలో స్వల్ప మెజార్టీతో ఓడిపోయారు. సొంత పార్టీ నేతలు ఒకరిద్దరు సుగుణమ్మకు వ్యతిరేకంగా పని చేసినా, పార్టీశ్రేణులు. కార్యకర్తలు, అభిమానులు, సామాజికవర్గం నాయకులు బలంగా మద్దతు నిలిచారు. 2019 తరువాత పార్టీని వీడకపోయినా నష్టం జరిగేలా వ్యవహరించలేదు. దీంతో 2021లో జరిగిన తిరుపతి నగరపాలకసంస్థ తొలి ఎన్నికల్లో పార్టీ తరపున సరైన కార్పొరేట్ అభ్యర్థులను ఎంపిక చేసి పోటీ చేయించలేకపోవడంలో విఫలమయ్యారనేది పార్టీ వర్గాల వాదన. అధికార పార్టీని ధీటుగా ఎదుర్కోలేక తమ పార్టీ అభ్యర్థులను పోటీకి నిలబెట్టలేక చివరకు సొంత మనవరాలి ఓటమితో నిరాశకు గురయ్యారు. అయితే పార్టీ కార్యకలాపాలకు దూరంకావడంగానీ, పార్టీని వీడలేదు. ఈ నేపథ్యంలో తరచూ పార్టీ పిలుపునిచ్చిన అనేక కార్యక్రమాలను తిరుపతిలో కొంతవరకు విజయవంతంగా నిర్వహించగలుగుతున్నారు. అయితే ఇతర పార్టీల నుంచి తెలుగుదేశం వైపు చూస్తున్న కొందరు అదే సామాజిక వర్గ నాయకులు సుగుణమ్మకు ఇంటిపోరు పెట్టించేలా కార్యకలాపాలు మొదలుపెట్టారనేది పార్టీ వర్గాల్లో సంచలనంగా మారింది. 2024 ఎన్నికలకు ముందుగానే అభ్యర్థులను ప్రకటించే యోచనలో అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యూహాలను సిద్ధం చేసుకుంటున్నారు. ఈ సమయంలో పార్టీలో ఊకా విజయకుమార్, జెబి శ్రీనివాస్, ఎన్‌వి ప్రసాద్ తదితరులు కూడా టిక్కెట్ ఆశిస్తూ తమతమ స్థాయిలో సిద్ధమవుతున్నారు. ఇటీవల ఈ వర్గం నాయకులు కొందరు జరిపిన సమావేశం కూడా హాట్‌టాఫిక్‌గా మారింది. తిరుపతిలో టిడిపి బలోపేతం చేసుకునే దిశగా, ప్రజలకు చేరువకావడానికి సుగుణమ్మ తనదైన శైలిలో పలు కార్యక్రమాలతో ముందుకువెళుతున్నారు. ఇదే సమయంలో ఆయా డివిజన్లలో నేతలు కూడా ఆమెకు మద్దతు ప్రకటిస్తున్నారనేది పార్టీ శ్రేణుల చర్చ.

రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థకు

# అత్యుత్తమ పురస్కారం



కోట, నవంబర్ 10 ప్రభాతవార్త

దేశంలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థను అగ్రగామిగా నిలిపిన ఛైర్‌పర్సన్ పేర్నాటి హేమసుష్మిత గురువారం న్యూఢిల్లీలోని అగ్రి బిజినెస్ అవార్డును అందుకున్నారు. న్యూఢిల్లీలోని ఎన్‌ఏఎస్‌సీ కాంప్లెక్స్ సింధి సింపోరియం హాలులో ఇండియన్ ఛాంబర్ ఆఫ్ ఫుడ్ అగ్రికల్చర్ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన 5వ ఇండియా అగ్రి బిజినెస్ సమిట్ 2022లో పాల్గొని భారతదేశ వ్యవసాయ రంగంలో అత్యుత్తమ ప్రతిష్టాత్మక అవార్డును అందుకున్నారు. హేమసుష్మిత చిన్నప్పటి నుంచే వ్యవసాయంపై మక్కువతో మట్టి వాసన చూస్తూ పెరిగి రైతులకు ఏదో చేయాలన్న తపనతో ఉండి అవకాశం రాక కుటుంబంతో కలిసి సేంద్రియ వ్యవసాయం వైపు అడుగులు వేసి నాణ్యమైన దిగుబడులు సాధిస్తూ ముందుకు పోతున్నారని చెప్పారు. రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి రాష్ట్రంలో రైతులకు సకాలంలో విత్తనాలు సబ్సిడీ ద్వారా అందజేయడం, నాన్ సబ్సిడీ ద్వారా అందజేయడం, సీడ్ ప్రాసెసింగ్ యూనిట్లను విత్తన నిల్వ గోదాములను నిర్మించడం ద్వారా రైతులకు మేలు చేసే విధంగా కృషి చేస్తున్నందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థకు ఈ అవార్డు దక్కిందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పూనం మాలకొండయ్య, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ వైస్ ఛైర్మన్ శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఉష్ణోగ్రతలు

10/11/2022



- తిరుపతి 26 డిగ్రీలు
- చిత్తూరు 28 డిగ్రీలు
- మదనపల్లి 22 డిగ్రీలు
- శ్రీకాళహస్తి 28 డిగ్రీలు
- వెంకటగిరి 29 డిగ్రీలు
- గూడూరు 29 డిగ్రీలు

## బంగారం ధరలు

10/11/2022



22 క్యారెట్స్ 1గ్రాము రూ. 4,820

24క్యారెట్స్ 1గ్రాము రూ.5,258

## కోడిగ్రుడ్ల ధరలు

10/11/2022



కోడిగ్రుడ్డు :రూ.5.50

1 డజను: రూ.66.00

## డిగ్రీ సెమిస్టర్ ఫలితాల్లో ఐఆర్‌ఎం విద్యార్థుల ప్రతిభ

కుప్పం, నవంబర్ 10 ప్రభాతవార్త




ఎస్వీయు విడుదల చేసిన డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో స్థానిక ఐఆర్‌ఎం డిగ్రీ కాలేజ్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు కళాశాల ఛైర్మన్ బిఎం దయానిధి తెలిపారు. బిఎస్సీ (ఎంపిసిఎస్)లో హేమలత, బికాం '(సిఎ)లో శివరంజని, బిబిఎలోసంధ్య, బిజెడ్‌సిలోబిందుఉత్తమ మార్కులతో కుప్పం పట్టణ టాపర్లుగా నిలిచారన్నారు. అలాగే ఫాతిమా, కావేరి, మేఘన, ఉమాదేవి, హర్షితరెడ్డి, స్వప్నశ్రీ, లలిత, ఆలియా ఖానుం కళాశాల టాపర్లుగా నిలిచారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఛైర్మన్ అభినందించారు.

## ప్రజా సంక్షేమం కోసం సిఎం నిరంతర కృషి - ఎమ్మెల్సీ భరత్

గుడుపల్లె, నవంబర్ 10 ప్రభాతవార్త



రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేసినట్లు ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు కెఆర్‌జె భరత్ పేర్కొన్నారు. గురువారం సోడిగానిపల్లి పంచాయతీలో గడపగడపకు మీ ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన చేపట్టారు. ఈ సందర్భంగా ప్రతి ఇల్లు తిరిగి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపిపి వరలక్ష్మి గోపి, జడ్పీటిసి కృష్ణమూర్తి, గోవిందన్, సంపంగి, అధికారులు పాల్గొన్నారు.

## డిగ్రీ ఫలితాల్లో కెడిసి విద్యార్థుల ఉత్తమ ప్రతిభ

కుప్పంరూరల్, నవంబర్ 10 ప్రభాతవార్త



ఎస్వీయు విడుదల చేసిన డిగ్రీ మొదటి సెమిస్టర్ ఫలితాల్లో కుప్పం డిగ్రీ కాలేజ్ విద్యార్థులు యూనివర్సిటీ స్థాయి ర్యాంకులు సాధించినట్లు కళాశాల ఛైర్ పర్సన్ శాంతనాగరాజ్‌తెలిపారు. బిఎస్సీ (ఎంపిజి)లో ప్రియాంక9.89పాయింట్లు, రాజేశ్వరి 9.68, బిఎస్సీ (ఎంఎస్‌సిఎస్)లో రూప 9.67, హసీనా 9.41పాయింట్లు, బికాం (సిఎ)లో వనిత 9.21 పాయింట్లు, పూజ 8.86, బిజెడ్‌సిలో యశ్వంతి 9.10, తేజశ్రీ8.80, బిబిఎలోగురుప్రసాద్8.68,రాము 8.33పాయింట్లతో కళాశాల టాపర్లుగా నిలిచారన్నారు. ఈసందర్భంగా విద్యార్థులనుఛైర్‌పర్సన్‌అభినందించారు.ప్రిన్సిపాల్ సుధారాణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

## జడ్పీసిఇఒచే హైస్కూల్‌లో ఆకస్మిక తనిఖీ

శాంతిపురం, నవంబర్ 10 ప్రభాతవార్త



మండలంలోని తుమ్మిశి మోడల్ క్లస్టర్ స్కూల్‌ను జడ్పీసిఇఒ ప్రభాకర్‌రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. స్కూలు రికార్డులు, రిజిస్టర్లు, తరగతి గదులు పరిశీలించారు. విద్యాబోధన ఎలా జరుగుతోందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనంను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల సంఖ్య అధికంగా ఉన్న నేపథ్యంలో అదనపు తరగతి గదులు, నాన్ టీచింగ్ సిబ్బందిని నియమించాలని హెచ్‌ఎం కోరారు. విషయంను జడ్పీఛైర్మన్ దృష్టికి తీసుకెళ్తామని సిఇఒ తెలిపారు.

## కర్ణాటక మద్యం స్వాధీనం.. ఇద్దరు అరెస్ట్

కుప్పం, నవంబర్ 10 ప్రభాతవార్త

అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ఇద్దర్ని అర్బన్ సిఐ శ్రీధర్ ఆదేశాల మేరకు అరెస్ట్ చేసి రిమాండుకు తరలించినట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు. వి.మిట్టపల్లిలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్న చిన్నరాజును అరెస్ట్ చేసి 283 మద్యం ప్యాకెట్లు, మల్లానూరు పంచాయతీ నెర్లకొటాలులో శాంభవి అనే మహిళను అరెస్ట్ చేసి ఆమె వద్ద పది సారా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

## ఇసుక లేకపోతే ఇళ్ళు ఎలా నిర్మించుకోవాలి

ఐరాల, నవంబర్ 10 ప్రభాతవార్త:



ఇసుక లేకపోతే ఇళ్ళు ఎలా నిర్మించుకోవాలని సభ్యులు అధికారులను నిలదీశారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ చింతం మోహన్ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈసందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడుతూ నదుల్లో ఇసుక తరలించరాదని అధికారులు, పోలీసులు కట్టుదిట్టం చేస్తున్నారని, అయితే ఇసుక లేకపోతే ఇళ్ళు ఎలా నిర్మించుకోవాలని అధికారులను నిలదీశారు. అధికారులు రీచ్‌ల నుండి ఇసుకను కొనుగోలు చేయాలని సూచిస్తున్నారని తెలిపారు. తద్వారా ప్రజలపై భారం పడుతోందని తెలిపారు. ఎర్రేపల్లె, గుండ్లపల్లె, వేదగిరివారిపల్లెరైతుభరోసాకేంద్రాల్లో పనిచేసేందుకు అధికారులు ఎవ్వరూ ముందుకు రావడం లేదని అధికారులు అంటున్నారని, అయితే ఎందుకు అలా జరుగుతోందని స్థానిక సర్పంచ్‌లు ప్రశ్నించారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ సుచిత్ర, ఎంపీడీఓ నిర్మలాదేవి, తహశీల్దార్ సుశీల, మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీలు,సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## పేదల అభ్యున్నతే సీఎం జగనన్న లక్ష్యం - ఎమ్మెల్యే వెంకటేగౌడ.

పెద్దపంజాణి నవంబర్ 10 ప్రభాతవార్త :



పేదల అభ్యున్నతే సీఎం జగనన్న లక్ష్యమని పలమనేరు ఎమ్మెల్యే డాక్టర్ వెంకటేగౌడ పేర్కొన్నారు. గురువారం కోగిలేరు పంచాయతీ పరిధిలోబసవరాజుకండ్రిగ గ్రామంలో ఆయన గడపగడపకు కార్యక్రమాన్నినిర్వహించారు. స్థానికసర్పంచ్ రమేష్‌బాబు ఆధ్వర్యంలోఅధికారులు,పార్టీనాయకులు,స్థానికప్రజా ప్రతినిధులు ఘనంగా స్వాగతంపలికారు. ఈసందర్భంగాఎమ్మెల్యేవెంకటేగౌడుమాట్లాడుతూఎన్నికల సమయంలో ఇచ్చినహామీలను 98శాతంకుపైగా అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డెప్ప,జెడ్పీటీసీ సుష్మాబాగారెడ్డి,సింగిల్‌విండో అధ్యక్షులు శంకరప్ప,మండల కన్వీనర్ బాగారెడ్డి,సర్పంచులు రమేష్‌బాబు,అఖిలా జాఫర్ జిల్లా కార్యదర్శు లు తమ్మిరెడ్డి,సుహేబ్ నాయకులు మాజీ ఎంపిటిపి ప్రసాద్ రెడ్డి,శివశంకర్ రెడ్డి,రాజారెడ్డి, సతీష్ రెడ్డి,సన్నపరెడ్డి,ఎంపీటీసీ పరందామ,అబ్బాస్,రెడ్డిబాషా స్థానిక నేతలు పాల్గొన్నారు.

## ఉపాధితో గ్రామలలో మౌళిక వసతులు కల్పన

కల్లూరు,నవంబరు10ప్రభాతవార్త

ఉపాధి హామీ పథకంతో గ్రామాల్లో మౌళిక వసతులు కల్పించడం జరుగుతుందని ఎంపీపీ సురేంద్రనాధరెడ్డి అన్నారు. పులిచెర్ల మండలం ఎర్రపాపిరెడ్డిగారిపల్లె, పోశంవారిపల్లె, బోడిరెడ్డిగారిపల్లెలో ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ గ్రామసభలు గురువారం నిర్వహించారు. ఈసభలలో ఎంపీపీ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా రైతులు, కూలీలకు ఆర్థిక భరోసా లభించే విధంగా పనులను మంజూరు చేస్తున్నామన్నారు. అనంతరం డీఆర్‌పీ పంచాయతీ పరిదిలో జరిగిన పనులపై సామాజికతనిఖీ నివేదికను చదివి వినిపించారు. సర్పంచి సైదాన్‌బీ, ఏపీఓ షౌకత్‌ఆలీ, ఈసీ కృష్ణ,ఉపాధి సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుగునమ్మ ఈసందర్భంగా తెలిపారు.

## నీట్‌లో సీటు సాధించిన వెంకటచరణ్‌తేజ

రొంపిచెర్ల,నవంబరు10ప్రభాతవార్త



మండలానికి చెందిన విద్యార్థి కోటా వెంకటచరణ్‌తేజ ఆంధ్రప్రదేశ్ ఎన్‌ఐటీలో సీటు సాధించాడు. బొమ్మయ్యగారిపల్లె పంచాయతీ పాతకురవపల్లెకు చెందిన కే.నారాయణ,సుహాసిని దంపతుల కుమారుడు వెంకటచరణ్‌తేజ జేఈఈ మెయిన్‌సలో 97.97పర్సంటేజ్‌తో 16024 ర్యాంక్ సాధించాడు. తాడేపల్లెగూడెం ఎన్‌ఐటీని ఎంపిక చేసుకున్నాడు. అతను ఇంటర్‌లో కూడా 982 మార్కులు సాధించి ఏపీలో 8వ ర్యాంకు సాధించగా ఇప్పుడు నిట్‌లో సీటు సాధించడంతో గ్రామస్థులు అభినందించారు.

## ఎమ్మెల్సీ భరత్‌చే కుప్పం - విజయవాడ బస్సు ప్రారంభం

కుప్పం, నవంబర్ 10 ప్రభాతవార్త



కుప్పం - విజయవాడ నగరాల మధ్య కుప్పం నుంచి నూతన ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు సర్వీసును గురువారం చిత్తూరు ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు కెఆర్‌జె భరత్ జెండా ఊపి ప్రారంభించారు. గతంలో నడుస్తున్న సర్వీసు కొన్ని కారణాలతో రద్దు అయిన నేపథ్యంలో ప్రజల ఇబ్బందులు గుర్తించిన ఎమ్మెల్సీ భరత్ విజయవాడ సర్వీసు నడపాలని ఆర్టీసీ అధికారులను కోరారు. విజయవాడ బస్సు రోజూ మధ్యాహ్నం 2గంటలకు కుప్పంలో బయలుదేరి మరుసటిరోజు ఉదయం 4.30గంటలకు విజయవాడకు చేరుతుంది. అక్కడనుంచి మధ్యాహ్నం 2.15గంటలకు బయలుదేరి ఉదయం 4.45గంటలకు కుప్పం చేరుతుందని డిపిటిఒ జితేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్, ఎఎంసి ఛైర్మన్ విద్యాసాగర్, ఎంపిపి అశ్విని మురుగేష్, జడ్పీటిసి ఎడిఎస్ శరవణ, కార్మికనేత రంగయ్య, డిసిఎంఇ ఇబ్రహీం, సిఎంఇ విజయరత్నం, డిఎం టికె స్వామి, స్థానిక నేతలు ఈశ్వర్, రాజా, నబీ, సర్పంచ్ మురుగేష్ పాల్గొన్నారు.

## సిఎం కప్ పోటీ జట్లకు ఎమ్మెల్సీ భరత్‌చే స్పోర్ట్స్ కిట్లు..డ్రస్సులు

కుప్పంరూరల్, నవంబర్ 10 ప్రభాతవార్త



జగనన్న క్రీడా సంబరాల్లో భాగంగా ఈనెల 15,16 తేదీల్లో సిఎం కప్ పోటీలను నియోజకవర్గస్థాయిలో నిర్వహించనున్నారు. ఈమేరకు సెలక్ట్ అయిన జట్లకు అవసరమైన స్పోర్ట్స్ కిట్లు, డ్రెస్‌లను చంద్రమౌళి స్మారక ట్రస్ట్ ద్వారా అందిస్తామని చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ పేర్కొన్నారు. వివరాలకు పిడి శేఖర్ 9963986 637 నెంబరును సంప్రదించాలని కోరారు. అనంతరం క్రీడా బ్రోచర్లను అందించారు. కార్యక్రమంలో ఎంపిపి అశ్విని మురుగేష్, మండల కన్వీనర్ హెచ్‌ఎం మురుగేష్ పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## సంస్కృతీ పునరుద్ధరణ కర్త ఎస్కేఆర్‌కు " డాక్టరేట్ "ప్రదానం

చౌడేపల్లి, నవంబర్ 10 ప్రభాతవార్త



పురాతన దేవాలయాల పునర్నిర్మాణదాత, సామూహిక వివాహప్రదాత, బోయకొండ ఆలయ మాజీ ఛైర్మన్ ఎస్.కె.వెంకట్రమణారెడ్డికి " డాక్టరేట్ "అందించి సత్కరించారు. ఆయన సమాజానికి చేస్తున్న సేవలతోపాటు భారతీయ సంస్కృతికి పునరుద్ధరణకు గాను చేపట్టిన పలు కార్యక్రమాలను గుర్తించిన భారత్ వర్చువల్ యూనివర్సిటీ ఫర్ పీస్ అండ్ ఎడ్యుకేషన్ వారు ఆయనకు డాక్టరేట్‌ను ప్రదానం చేసారు. న్యూఢిల్లీకి చెందిన హిందూ కల్చర్ సంస్థల ఛైర్మన్ మునస్వామి చేతుల మీదుగా ఎస్కేఆర్ తన నివాసంలో కుటుంబ సభ్యులతో కలసి డాక్టరేట్‌ను అందుకొన్నారు.

## విఆర్‌ఎస్‌ఎస్ పర్యవేక్షణలో కమిటీ సిఫారస్సు జరగాలి

చౌడేపల్లి, నవంబర్ 10 ప్రభాతవార్త

వాల్మీకి రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో శామ్యూల్స్ ఆనంద్‌కుమార్ ఏకసభ్య కమిటీ సిఫారస్సు పర్యవేక్షణ జరగాలని ఆసంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంగల గంగరాజు కోరారు. ఈమేరకు స్థానిక సంఘ నాయకుల ఆధ్వర్యంలో తహశీల్దార్‌కు వినతిపత్రమందించారు. వాల్మీకుల స్థితిగతులపై సంపూర్ణ అవగాహణతో గత 17యేళ్ళుగా అలుపెరగని పోరాటాలు చేస్తున్న విఆర్‌ఎస్‌ఎస్ సంఘ నాయకుల సూచనలు తీసుకొని కమిటీ పర్యవేక్షణ కొనసాగాలనీ, అలా అయితేనే వాల్మీకులు సామాజికంగా, ఆర్థికంగా ఎదిగేందుకు దోహదపడుతుందని రెవిన్యూ అధికారులకు వినతిపత్రమందించారు. విఆర్‌ఎస్‌ఎస్ నాయకులు వెంకటేష్, ఆదినారాయణ, పవన్‌కుమార్, మునస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## గంగమ్మకు హుండీ ఆదాయం రూ. 62.03లక్షల ఆదాయం

బోయకొండ(చౌడేపల్లి), నవంబర్ 10 ప్రభాతవార్త

శక్తిస్వరూపిణీ బోయకొండ గంగమ్మకు హుండీ ద్వారా రూ. 62,03,493ల ఆదాయం సమకూరిందని ఇఒ చంద్రమౌళి తెలిపారు. కొండపై ఛైర్మన్ మిద్దింటి శంకరనారాయణ ఆధ్వర్యంలో 52రోజులకు గాను జరిగిన హుండీ లెక్కింపులో నగదుతోపాటు 497గ్రాముల బంగారం, 932గ్రాముల వెండిని భక్తులు అమ్మవారికికానుకలుగాసమర్పించారన్నారు. ధర్మకర్తలమండలిసభ్యులుపూర్ణిమారాయల్‌మోహన్, శ్రావణి భానుప్రకాష్, దేవాదాయధర్మాదాయఇన్‌స్పెక్టర్‌శశికుమార్, ఆలయఅధికార, అర్చక, సిబ్బంది పాల్గొన్నారు.

## పలమనేరు డిఎస్పీగా సుధాకర్‌రెడ్డి

పలమనేరు,నవంబర్ 10,ప్రభాతవార్త:

పలమనేరు డిఎస్పీగా సుధాకర్‌రెడ్డి గురువారం బాధ్యతలను స్వీకరించారు. గతంలో చిత్తూరులో విధులు నిర్వహిస్తున్న సుధాకర్‌రెడ్డి బదిలీపై పలమనేరు డిఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ డిఎస్పీగా పని చేస్తున్న గంగయ్యను మంగళగిరి పోలీస్ హెడ్ క్వాటర్‌కు వెళ్లడం జరిగింది. ఈ మేరకు పలమనేరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డి, వైకాపా మాజీ పట్టణ కన్వీనర్ సుధాలు నూతన డిఎస్పీగా బాధ్యతలు చేపట్టిన సుధాకర్‌రెడ్డిని సన్మానించారు.

## తెలుగు భాషకు వెలుగుల సూరీడు సి.పి.బ్రౌన్

పలమనేరు,నవంబర్ 10,ప్రభాతవార్త:



తెలుగు భాషకు వెలుగులునింపిన సూరీడు సి.పి.బ్రౌన్ అని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసినాథం నాయుడు అన్నారు. గురువారం స్థానిక కళామందిరంలో సి.పి.బ్రౌన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు ప్రజలందరూ తనకు గురువులే అని చెప్పుకున్న బ్రౌన్ మహనీయుడన్నారు. వేమనపద్యాలనుసేకరించిముద్రించడమేకాకఆంగ్లంలోకికూడాఅనువదించి విశ్వవ్యాప్తం చేశాడన్నారు. పుష్ప, దామోదరనాయుడు, మూర్తి, శివశంకర్‌రెడ్డి, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## వసతి గృహానికి గీజర్ వితరణ

సదుం,నవంబరు10ప్రభాతవార్త

సదుంలోని ఎస్సీ బాలుర వసతి గృహానికి జాండ్రపేటకు చెందిన ఆకుల శ్రీనివాసులు గురువారం గీజర్‌ను వితరణగాఅందజేశారు. చలికాలం విద్యార్థులకు వేడినీటిని స్నానానికి ఉపయోగించుకుంటే బాగుంటుందని తలచిఆయనతండ్రిఆకుల గంగులప్ప గుర్తుగా గీజర్‌ను జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు పెద్దిరెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. వసతిగృహసంక్షేమాధికారిబాబు, డాక్టర్‌ఇందాద్, కృష్ణయ్య, పాపిరెడ్డి, బాలకృష్ణపాల్గొన్నారు.

## కంటి వైద్యశిబిరాలు వినియోగించుకోవాలి

సదుం,నవంబరు10ప్రభాతవార్త

గ్రామీణ ప్రాంతాల వారికి ఉచిత కంటి వైద్య శిబిరాలు వరాలు అని చెన్నై ఎంఎన్ కంటి వైద్యశాల వైద్యులు తెలిపారు. గురువారం బూరగమంద సచివాలయంవద్ద ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా పలువురికి కంటి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఆపరేషన్లకు ఎంపికైన వారికి ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు చేయనున్నట్లు వారు చెప్పారు. సర్పంచి వెంకటరమణ, వుప సర్పంచి సరిత, ఎంపీటీసీ మల్లికార్జున, గణేష్‌రెడ్డి, ఈశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## రెచ్చిపోతున్న మట్టి మాఫియా

-దోచుకునే అవకాశముంటే పంచభూతాలను కూడా వదలని మట్టి మాఫియా

ఓజిలి, నవంబర్ 10 ప్రభాతవార్త



ఓజిలి మండలంలోని ముమ్మాయిపాలెం చెరువులో మట్టిని తరలించేస్తున్నారు. నాయకులను అడ్డుపెట్టుకొని మట్టిని తరలిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారంతో పాటు ఫ్యాక్టరీలకు, ఇళ్లప్లాట్లు, వెంచర్లకు తరలించేస్తున్నారు. ఇక్కడ ఫ్యాక్టరీలు, వెంచర్లు వెలుస్తుండటంతో మట్టికి డిమాండ్ ఏర్పడింది. ఇదే అదనుగా భావించి మట్టిని ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. మట్టి మాఫియాను అడ్డుకోవాల్సిన రెవెన్యూ యంత్రాంగం, ఇరిగేషన్, మైనింగ్ యంత్రాంగం ఇటువైపు కన్నెత్తి చూడకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇష్టానుసారంగా మట్టిని తవ్వుకొని లక్షలు గడిస్తున్నారు. మట్టి దందాపై అధికారులకు సమాచారం వెళ్లినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్రమ మట్టి తవ్వకాలను నిలుపుదల చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## నాయుడుపేటలో వర్షం

నాయుడుపేట రూరల్ నవంబరు 10 ప్రభాతవార్త ;

నాయుడుపేట మండలంలోని పలుగ్రామాల్లో గురువారం తెల్లవారుజామున ఉరుములు మెరుపులతో కూడిన ఒకమోస్తారు వర్షం కురిసింది. ఈవర్షంతో రైతులు వ్యవసాయ పనులు జోరుగా చేపడుతున్నారు. గ్రామాల్లో రోడ్లు,వీదులు బురదమయంగా మారాయి. గ్రామాల్లో పంటపొలాలు పచ్చధనంతో కనువిందు చేస్తున్నాయి. కురుస్తున్న వర్షాలకు గ్రామీణరోడ్లు గుంటలుపడి అద్వానంగా ఉన్నాయి. గ్రామాల్లో రైతులు ముమ్మరంగా వరినాట్లు వేసేపనిలో ఉన్నారు.

## పేటలో అక్రమంగా ఇసుక తరలింపు

పట్టించుకోని ఎస్ఈబి-పోలీసులు

నాయుడుపేట రూరల్, నవంబరు 10 ప్రభాతవార్త:



నాయుడుపేట మండలంలోని అయ్యప్పరెడ్డిపాళెం సమీపంలో ఉన్న మామిడికాలువ నుండి కొంతమంది అక్రమార్కులు రాత్రిసమయంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న సంబంధిత ఎస్ఈబి-పోలీసులు పట్టించుకోవడంలేదని గ్రామీణ ప్రజలు ఆరోపిస్తున్నారు. గత కొంతకాలం నుండి నాయుడుపేటకు చెందిన కొంతమంది అక్రమార్కులు ప్రభుత్వ నిబంధనలకు విరుద్దంగా రాత్రిసమయంలో మామిడికాలువ నుండి ట్రాక్టర్ల ద్వారా ఇసుకను ఇతరప్రాంతాలకు తరలించి లక్షలరూపాయలు దోచుకుంటున్నారు. సూళ్ళూరుపేట, తడ, ఆరంబాకం తదితర ప్రాంతాల్లో ఇసుకకు మంచిగిరాకి ఉండటంతో అక్రమార్కుల వ్యాపారం మూడుపువ్వులు ఆరుకాయలుగా సాగుతోంది. అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్న అక్రమార్కులపై చర్యలు తీసుకొని అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

## నేర నివారణకు ప్రత్యేక చొరవ తీసుకోవాలి

- డీఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసి వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కట్టా సుధాకర్‌రెడ్డి

నాయుడుపేట, నవంబర్ 10 ప్రభాతవార్త



నాయుడుపేట డివిజన్ పరిధిలో నేర నివారణకు ప్రత్యేక చొరవ తీసుకొని ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డిని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కట్టా సుధాకర్‌రెడ్డి కోరారు. గురువారం నాయుడుపేట డీఎస్పీగా బదిలీపై వస్తున్న రాజగోపాల్‌రెడ్డిని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కట్టా సుధాకర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డికి శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛం ఇచ్చి సత్కరించారు. ఈ సందర్భంగా కట్టా సుధాకర్‌రెడ్డి వెంట మాజీవైస్‌ఎంపీపీనల్లు కస్తూరయ్య, ఓజిలి వైసీపీ నాయకులు ముమ్మడి సుబ్బారావు తదితరులు ఉన్నారు.

## కోటలో మంచినీటికి కటకట

కోట, నవంబర్ 10 ప్రభాతవార్త

మేజర్ పంచాయతీ కోటలో ఎన్‌జీఆర్ కాలనీలో గత 15 రోజులుగా నీటి సరఫరా నిలిచిపోవడంతో ఆ కాలనీవాసులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. ఆ ప్రాంత ప్రజలు పంచాయతీ పాలకులకు, అధికారులకు తెలిపినా ఏ ఒక్కరూ పట్టించుకోలేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శికి తెలియజేస్తే ఇదిగో అదిగో అంటూ జాప్యం చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తాగేందుకు మంచినీళ్లను కొనుగోలు చేసుకుంటున్నా స్నానాలు చేసేందుకు నీళ్ల లేక ఎంతో ఇబ్బందులు పడుతున్నామని మహిళలు వాపోయారు. వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నా పంచాయతీ నీటి సరఫరా చేయలేకపోతోందని ప్రశ్నిస్తున్నారు.

## భారత్ జోడోయాత్రకు అపూర్వ స్పందన - మాజీ ఎంపీ చింతా మోహన్

కోట, నవంబర్ 10 ప్రభాతవార్త



కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రకు అపూర్వ స్పందన లభిస్తోందని తిరుపతి మాజీ ఎంపీ చింతా మోహన్ అన్నారు. గురువారం కోటలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ కన్యాకుమారి మొదలుపెట్టిన భారత్ జోడోయాత్ర ఐదు రాష్ట్రాల్లో దిగ్విజయంగా పూర్తి చేసుకొని 1650 కిలోమీటర్లు ఇప్పటికి పూర్తి చేసుకుందన్నారు. రాహుల్‌గాంధీ ఐదు పదుల వయస్సులో కూడా 15 సంవత్సరాల బిడ్డలా యాత్రలో రోడ్డుపై నడుస్తుంటే ఆయన్ను చూసేందుకు చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ఉత్సాహంగా ముందుకు కదులుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దళిత ద్రోహిగా మిగిలిపోయారని చెప్పారు. రాయలసీమ, విశాఖపట్నం ప్రాంతాల్లో చిచ్చుపెడుతున్నారని చెప్పారు. 33 మంది కేంద్రమంత్రులతో తాను క్యాబినెట్‌లో దుగరాజపట్నం పోర్టును మంజూరు చేయిస్తే ఈ బీజేపీ ప్రభుత్వం దాన్ని రద్దు చేసిందన్నారు. దివంగత నేత నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి బతికి ఉంటే ఆ పోర్టుపై పోరాటాలు చేసేవారని చెప్పారు. ఇప్పటికీ డిగ్రీలు చదువుకున్న విద్యార్థులు, ఇంజినీరింగ్ చదువుకున్న వారు నిరుద్యోగ సమస్యతో అల్లాడుతున్నారని చెప్పారు. 2024లో రాష్ట్రంలో, కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఆయన వెంట జిల్లా మైనార్టీ నాయకులు సల్మాన్‌రాజ్ తదితరులు ఉన్నారు.

## లారీని ఢీకొన్న కారు

- ప్రమాదంలో ఆరుగురికి గాయాలు

ఓజిలి, నవంబర్ 10 ప్రభాతవార్త



ఓజిలి జాతీయ రహదారిపై గురువారం ముందు వెళుతున్న లారీని కారు ఓవర్ టేక్ చేయబోయి ఢీకొంది. లారీని వెనుక ఢీకొనడంతో కారులో ప్రయాణిస్తున్న ఆరుగురు ప్రయాణికులు గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో నెల్లూరులోని ఓ ప్రైవేటు వాహనంలో తరలించారు. అందులో ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా, మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. ఓజిలి ఎస్ఐ డి.ఆదిలక్ష్మి సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## అభివృద్ధి పనులు వేగవంతం

- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు, నవంబర్ 10 ప్రభాతవార్త:



చిత్తూరు నగర పరిధిలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మేయర్ అముద, కమీషనర్‌డాక్టర్ జె. అరుణలతోకలిసి ఇంజనీరింగ్ విభాగం అధికారులతో నగర అభివృద్ధిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో డిప్యుటీ మేయర్‌ఆర్.చంద్రశేఖర్, స్టాండింగ్‌కమిటీ సభ్యులు శ్రీకాంత్, ఎంఇ ధనలక్ష్మీ, డిఇలు, ఎఇలు పాల్గొన్నారు.

## కార్మికులకు దుస్తులు పంపిణీ

సదుం,నవంబరు 10ప్రభాతవార్త

సదుం గ్రామ పంచాయతీ పరిధిలో పనిచేసే కార్మికులకు, స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులకు గురువారం సదుంలోని లయన్స్‌క్లబ ఆఫ్ మణికంఠ వారు దుస్తులను పంపిణీ చేశారు. హైదరాబాదుకు చెందిన ఉషాకులకర్ణి, మీనాక్షిగోపాలకృష్ణలు వీటిని వితరణగా ఇచ్చారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యశాల ఛైర్మెన్ కృష్ణారెడ్డి, సర్పంచి ఉషారాణి, లయన్స్‌క్లబ్‌కు చెందిన రాజారెడ్డి, మనోజ్‌కుమార్‌రెడ్డి, సహదేవయ్య, మల్లయ్య, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అభిషేకాలకు పెరుగుతున్న భక్తులు

శ్రీకాళహస్తి,నవంబర్ 10 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే సేవల్లో అభిషేకాలు ఎంతో ముఖ్యమైనవి. భోళాశంకరుడు అభిషేక ప్రియుడంటారు. ఈ నేపద్యంలో గురువారం సాధారణం కన్నా అధికంగా అభిషేకాలు జరిగాయి. భక్తుల సంఖ్య కూడా ఓ మోస్తరుగా ఉంది. ఓవైపు తుఫాను ప్రకటనలు వెలువడుతున్నా లెక్క చేయక భక్తులు వస్తున్నారు. 15వేల మంది భక్తులు దర్శించుకున్నారు. రాహుకేతుదోష నివారణ పూజలు కూడా 1600 జరిగాయి. స్వామి అమ్మవార్లకు నిర్వహించే సేవల్లో అభిషేకాలు 42 జరిగాయి. కాగా మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు 26, గురుదక్షిణామూర్తికి 69 అభిషేకాలు జరిగినట్లు దేవస్థానం అధికారికంగా ప్రకటించింది. లడ్డుల విక్రయాలు కూడా 12వేలు జరిగినట్లు దేవస్థానం ప్రకటించింది.

## క్షేత్ర స్థాయిలో పక్కాగా అభివృద్ధి పనులు

కమిషనర్ డాక్టర్ జె.అరుణ

చిత్తూరు, నవంబర్ 10 ప్రభాతవార్త:



ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను క్షేత్ర స్థాయిలో వేగవంతం చేయాలని మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ అధికారులను ఆదేశించారు. నగర పరిధిలోని వార్డు కార్యదర్శులు, వాలంటీర్లతో గురువారం ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్యత పనులైన హౌసింగ్, అర్బన్ రీసర్వే, మనబడి నాడు-నేడు, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై వార్డుల వారీగా సమీక్షించారు. నిర్దేశించిన లక్ష్యాల మేరకు వార్డు కార్యదర్శులు, వాలంటీర్లు సమన్వయం చేసుకొని క్షేత్ర స్థాయిలో విధులు నిర్వర్తించాలన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కమీషనర్ గోవర్ధన్, ఎంఇ ధనలక్ష్మీ, ఎసిబి రామకృష్ణుడు, మెప్మా సిఎంఎం గోపి తదితరులు పాల్గొన్నారు.

## వైసిపి నాయకులకు చట్టాలు వర్తించవా!

పాలసముద్రం, నవంబర్ 10 ప్రభాతవార్త:

అధికార వైకాపా నాయకులకు చట్టాలు వర్తించవా! అంటూ పాలసముద్రం జనసేన సీనియర్ నాయకుడు రాజారత్నం ప్రశ్నించారు. పాలసముద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కార్వేటినగరం మండల జనసేన పార్టీ కార్యాలయంలో నిజమైన లబ్దిదారులకు ఇళ్ళను మంజూరు చేయాలని జనసేన ఆధ్వర్యంలో 2020 జూన్‌లో నిరసన ప్రదర్శన చేపట్టడం జరిగిందన్నారు. అప్పుడు మాస్కులు ధరించి జనసేన నాయకులు నిరసన తెలిపారన్నారు. అయితే జనసేన నేతలపై తప్పుడు కేసులు బనాయించారని ఆరోపించారు. మరుసటి రోజు డిప్యుటీ సిఎం ఆధ్వర్యంలో కార్వేటినగరంలో వైకాపా భారీ సభ నిర్వహించి కోవిడ్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఎలాంటి కేసులు నమోదు చేయలేదన్నారు. అయితే జనసేన నేతలపై అక్రమ కేసులు నమోదు చేశారని ఆరోపించారు.

## ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు

- ఎఐటియుసి నాయకులు డిమాండ్



చిత్తూరు, నవంబర్ 10 ప్రభాతవార్త:

ఆటో డ్రైవర్లకు ప్రత్యేకంగా ప్రభుత్వం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఎఐటియుసి నాయ కులు డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారం కోసం చిత్తూరు గాంధీ విగ్రహం ఎదుట గురువారం ఎఐటియుసి ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమను ఉద్దేశించిన ఎఐటియుసి నగర కార్యదర్శి సత్యమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల కోసం ప్రత్యేకంగా సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసిందని ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం బోర్డును ఏర్పాటు చేయాలని 20 సంవత్సరాలుగా ఉద్యమాలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నగర సిపిఐ కార్యదర్శి గోపినాథ్, నాయకులు మణి, దాసరి చంద్ర, రఘు, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

# దేశం నాయకులకు హైకోర్టులో ఊరట?

**41 ఏ నోటీసు జారీ చేయాలి!**



శ్రీకాళహస్తి, నవంబర్ 10 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి తెలుగుదేశం కార్యకర్తలపై పోలీసులు బనాయించిన పలు కేసులకు సంబంధించి హైకోర్టులో ఊరట లభించిందని నియోజకవర్గ ఇన్చార్జి బొజ్జల సుదీర్‌రెడ్డి గురువారం తెలిపారు. గత నెల 27న శ్రీకాళహస్తిలో ఓ అనుమానాస్పద మృతదేహానికి సంబంధించిన వివాదం ఏర్పడగా ఇక్కడ మాయమైన బాలిక తల్లిదండ్రులు ఆ మృతదేహం తమ బిడ్డదే అని రోదించ టంతో తాము స్పందించి ఆందోళనలు చేసామన్నారు. అయితే శ్రీకాళహస్తి పోలీసులు ఒకే కేసుకు సంబం ధించి చరిత్ర సృష్టించే విధంగామూడు కేసులు బనాయించారని 41 మందిపై కేసులు బనాయించారని వివరించారు. ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ తాము రాష్ట్ర సమోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించా మన్నారు. కోర్టులో గురువారం వాదోపవాదాలు విన్న సమోన్నత న్యాయస్థానం అరెస్టులు మాని 41 ఏ నోటీసులు జారి చేయాలని ఆదేశించినట్లు వివరించారు. తాము శాంతి యుతంగా ధర్నా చేసామని ఎక్కడ విధ్వంసాలు చేయలేదని ప్రజా జీవనానికి విఘాతం కల్పించలేదన్నారు. కానీ తమపై పోలీసులు ఏక పక్షంగా రక రకాల కేసులతో పాటు ఎస్‌సి, ఎస్‌టి వేధింపు కేసు నమోదు చేసారని వివరించారు. వాలంటీర్ చంద్రశేఖర్ తండ్రి బత్తెయ్య ఇచ్చిన ఫిర్యాదుపై 14 మందిపై ఎస్‌సి ఎస్‌టి కేసు, కానిస్టేబుల్ ఇచ్చిన పిర్యాదు మేరకు 25మందిపై కేసులు అక్రమంగా బనాయించి ఇబ్బంది కల్గించారని ఏకపక్షంగా పోలీసుల వ్యవహారంపై కోర్టుకు వెళ్ళామన్నారు. అయితే ఈ కేసుకు సంబంధించి శ్రీకాళహస్తి డివైయస్‌పి కూడా కౌంటర్ దాఖలు చేసినట్లు తెలిసింది.

**41ఏ ఏం చెబుతుంది?**

ఐపిసి 41ఏ ఏం చెబుతుందంటే 7 సంవత్సరాల లోపు శిక్ష్ పడుతుదనే నేరాలకు సంబంధించి కూడా పోలీసులు బెయిల్ ఇచ్చే అవకాశం ఉంది. కానీ శ్రీకాళహస్తి పోలీసులు ఎందుకు ఈ దిశగా వ్యవహరించలేదన్నది దేశం వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

## యువత క్రీడల్లో రాణించేలా ప్రోత్సాహం అందిస్తాం : ఎమ్మెల్సీ

**- చంద్రమౌళి స్మారక ట్రస్ట్‌చే క్రికెట్ టోర్నీ ప్రారంభం**



కుప్పం, నవంబర్ 10 ప్రభాతవార్త : యువత క్రీడల్లో రాణించేలా తగు ప్రోత్సాహం అందిస్తామని చిత్తూరు ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు కెఆర్‌జె భరత్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో దివంగత డా॥ చంద్రమౌళి స్మారక ట్రస్ట్ అధ్వర్యంలో భరత్ అన్న యువసైన్యంచే నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నీని ఎమ్మెల్సీ భరత్ ప్రారంభించి ప్రసంగించారు. యువత విద్యతో పాటు క్రీడల్లో సైతం రాణించాల్సి న అవసరం ఉందన్నారు. క్రీడాకారులకు ట్రస్ట్ తరపున వివిధ సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అనంతరం బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్, ఎఎంసి వైస్ ఛైర్మన్ విద్యాసాగర్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ మునస్వామి, కమీషనర్ రవిరెడ్డి, పలువురు కౌన్సి లర్లు పాల్గొన్నారు.

## వందకోట్ల నిధుల ప్రణాళికలు 14లోగా అందించాలి : జడ్పీఛైర్మన్

కుప్పం, నవంబర్ 10 ప్రభాతవార్త : సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కుప్పం నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రత్యేక ప్యాకేజీగా ప్రకటించిన వంద కోట్ల రూపాయల నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనుల ప్రణాళికలను సంబంధిత ప్రజాప్రతినిధులు ఈనెల 14వతేది లోగా సమర్పించాలని జడ్పీఛైర్మన్ శ్రీనివాసులు సూచించారు. గురువారం మండల కార్యాలయంలో జిల్లా కలెక్టర్ సూచనలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జడ్పీఛైర్మన్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని కుప్పం, గుడుపల్లె, రామకుప్పం, శాంతిపురం మండలాల్లో తక్షణం ప్రజలకు అవసరమయ్యే పనులను ప్రాధాన్యత క్రమంలో ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. అలాగే ప్రస్తుతం నిర్మాణాల్లో ఉన్న సచివాలయ భవనాలు, ఆర్‌బికె భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయా మండలాల్లో జరుగుతున్న నాడు - నేడు పనులు వేగవంతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో చిత్తూరు ఎంపి రెడ్డెప్ప, ఎమ్మెల్సీ కెఆర్‌జె భరత్, జడ్పీసిఇఒ ప్రభాకర్‌రెడ్డి, ఎంపిపిలు అశ్విని మురుగేష్, వరలక్ష్మి, జడ్పీటిసిలు ఎడిఎస్ శరవణ, కృష్ణమూర్తి, శ్రీనివాసులు, కుప్పం పరిశీలకుడు రెడ్డెప్ప, మండల కన్వీనర్ హెచ్‌ఎం మురుగేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని జగన్, మోడీకి తాకట్టుపెట్టారు : డిసిసి అధ్యక్షుడు



కుప్పంరూరల్, నవంబర్ 10 ప్రభాతవార్త : ఇరవై రెండు ఎంపిలను గెలిపిస్తే కేంద్రం మెడలు వ ంచుతానని, ప్రత్యేక హోదా సాధిస్తానని సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పేర్కొని ఇప్పుడు ప్రధాని మోడీకి ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టారని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డా॥ బిఆర్ సురేష్‌బాబు పేర్కొన్నారు. గురువారం కుప్పంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోడీ ఏ ముఖం పెట్టుకుని ఎపికి వస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్రాన్ని నిలదీసే అవకాశాలు ఉన్నా పట్టించుకోక నేడు రాష్ట్ర పర్యటనకు వస్తున్న ప్రధాని మోడీకి సిఎం జగన్మోహన్‌రెడ్డి రెడ్ కార్పెట్‌ను పరచడం దారుణమన్నారు. ప్రత్యేక హోదాతో ఉద్యోగాలు వస్తాయని చెప్పి నేడు నిరుద్యోగుల గొంతు కోశారని విమర్శించారు. సిఎం జగన్మోహన్‌రెడ్డి, ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు, జనసేనాని పవన్ కళ్యాణ్‌లు ముగ్గురూ ముగ్గురే అని విమర్శించారు. విభజన హామీలు అమలు చేయడం లేదని, రైల్వే జోన్ వైజాగ్‌కు ఇవ్వడం లేదన్నారు. ఎపికి భాజపా న్యాయం చేసింది ఏమీ లేదన్నారు. ప్రతి బడ్జెట్‌లో అన్యాయం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. సమావేశంలో పిసిసి అధికార ప్రతినిధి వెంకటరమణబాబు, స్థానిక నేతలు రాజారాం, మురుగన్, ప్రమోద్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను పరిశీలించిన చీఫ్ ఇంజనీర్



కాణిపాకం, నవంబర్ 10 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో అమల వు తున్న మాస్టర్‌ప్లాన్ అమలులో భాగంగా జరుగు తున్న వివిధ అభివృద్ధి పనులను రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయశాఖ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాసరావు గురు వారం పరిశీలించారు. మాస్టర్ ప్లాన్ అమలులో భాగంగా భక్తుల సౌకర్యార్థం దేవస్థానంలో కోట్లాది రూపాయల వ యయ అంచనాలతో పలు అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈపనులను శ్రీనివాసరావు పరిశీలించారు. ఈమేరకు బస్టాండు, నూతన కళ్యాణ మండపంలు, వినాయకసదన్ పైన నిర్మిస్తున్న భవనాలు, క్యూకాంప్లెక్స్ తదితర అభివృద్ధి పనులను ఆయన ఈఈ శేఖర్‌తో కలసి పరిశీలించారు. ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని ఈఈ వెంకట నారాయణను సూచించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఏఈలు అరవింద్, శివాంజనేయులు, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆలయ అభివృద్ధికి రూ.1.84 లక్షలు విరాళం



కాణిపాకం, నవంబర్ 10 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో అమలవు తున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ఓ భక్తుడు 1.84 లక్షల రూపాయలు విరాళంగా అంద జేశారు. కడప జిల్లా జమ్మలమడుగుకు చెందిన శివ వేదాంశి అనే భక్తుడు వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు 92,500 రూపాయలు, శ్రీసిద్ది వినాయక గోసంరక్షణ ట్రస్ట్‌కు 50 వేల రూపాయలను, నిత్యాన్నదాన పథకానికి 42,500 రూపాయలను విరాళం గా అందించారు. ఈ మొత్తాన్ని దాత కుటుంబ సభ్యులతో కలసి ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సూపరిన్‌టెండెన్‌ట్ కోదండపాణిలకు అందజేశారు. దాతలకు స్వామివారి దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు.

# మాట తప్పారు.. మా గుడిని అప్పగించండి

**- మా మనోభావాలు దెబ్బతింటున్నాయి**
**- తిమ్మాజికండ్రిగ గ్రామస్తులు**



నాయుడుపేట, నవంబర్ 10 ప్రభాతవార్త : నాయుడుపేట మండలం తిమ్మాజికండ్రిగ స్వర్ణముఖి నది ఒడ్డున వెలసి ఉన్న శ్రీ అభయ వెంకటేశ్వరస్వామి ఆలయం వేదపండితుల ద్వారా ఆగమ శాస్త్రం ద్వారా నిర్మించుకోవడం జరిగిందని, ఆ ఆలయాన్ని ఇస్కాన్ టెంపుల్‌కు అప్పగించగా, వారు ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదని, దేవాలయాన్ని తిరిగి మాకు అప్పగించాలని స్థానికులు గురువారం ఆలయ ప్రాంగణ ంలో విలేఖరుల సమావేశంలో తెలిపారు. గ్రామస్థులు మాట్లాడుతూ కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో నాయుడుపేట పట్టణంలోని స్వర్ణముఖి నది ఒడ్డున వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించుకోవడం జరిగిందని తెలిపారు. ఆ ఆలయం నిర్వహణ బాధ్యతలు ఎవరికో ఒకరికి అప్పగిస్తే బాగుంటుందని భావించి కులమతాలకు అతీతంగా వ్యవహరించే ఇస్కాన్ వారైతే బాగుంటుందని సుమారు రూ.40 కోట్లు ఖర్చు పెట్టి దేవాలయాన్ని నిర్మించడం జరిగిందని తెలిపారు. ఆలయాన్ని ఆగమ శాస్త్రం ప్రకారం గోవిందు నామాలు కూడా పూజా పురస్కారాలు చేయాలని, ఇక్కడ నిర్మించిన దేవాలయాలు ఏవీ చెక్కుచెదరకుండా ఉంచి ఖాళీ స్థలాల్లో ఇస్కాన్ టెంపుల్‌కు అవసరమైన అదనపు గదులు నిర్మించుకోవాలని చెప్పి వారికి తొమ్మిది నెలల క్రితం అప్పగించడం జరిగిందన్నారు. ముందుగా అన్ని ఒప్పందాలకు ఒప్పుకొని దేవాలయాన్ని అప్పగించిన తర్వాత ఇస్కాన్ టెంపుల్ వారు చెప్పిన ఏ ఒక్క పనీ వినకుండా వాస్తు శాస్త్రానికి వ్యతిరేకంగా వారి ఇష్టానుసారంగా వ్యవహరించడం ఈ గ్రామప్రజల మనోభావాలు దెబ్బతినే విధంగా ఉందన్నారు. దీన్ని తామంతా వ్యతిరేకిస్తున్నామని గ్రామస్థులు తెలిపారు. అభయ వేంకటేశ్వరస్వామి దేవాలయానికి మాడవీధులు ఎంతో ముఖ్యమని, ఆ మాడవీధుల్లో గుడిలో జరిగే కార్యక్రమాల సమయంలో ఊరేగింపుల కోసం ఏర్పాటు చేసిన వీధుల్లో ఇస్కాన్ వారు ప్రైవేటు వ్యక్తులకు భవన నిర్మాణాలు చేపట్టడాన్ని తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. గ్రామస్థులతో పాటు కొంతమంది పెద్దలు కలిసి దాతల వద్ద చందాలు దండుకొని వేంకటేశ్వర స్వామి దేవాలయాన్ని నిర్మిస్తే మా మనోభావాలకు వ్యతిరేకంగా ఇస్కాన్ వారు వ్యవహరించడాన్ని తాము తప్పుబడుతున్నామని తెలిపారు.

**దేవాలయాన్ని తీసుకెళ్లండని చెప్పడం బాధాకరం :**

అభయ వేంకటేశ్వర స్వామి దేవాలయం పక్కన మహాలక్ష్మమ్మ దేవాలయాన్ని నిర్మించాలని అనుకుం టున్న తరుణంలో నాయుడుపేట పట్టణానికి చెందిన కావేరిపాకం వల్లెమ్మ, సిద్ధయ్య, వెంకటేశ్వర్లు ముందుకొచ్చి శ్రీమహాలక్ష్మమ్మ దేవాలయాన్ని మేము నిర్మించి ఇస్తామని మాట ఇచ్చి అమ్మవారికి దేవాలయానికి సుమారు రూ.60 లక్షలు ఖర్చవుతుందని వేదపండితులు చెప్పడంతో వారు దానికి అంగీకరించి దేవాలయాన్ని నిర్మించి సుమారు రూ.42 లక్షలు ఖర్చు చేసి సమయానికి ఇస్కాన్ వారికి అప్పగించడంతో, ఇస్కాన్ వారు ఇవేమీ మాకు పనికిరావని చెప్పి దేవాలయం నిర్మించే వ్యక్తులకు ఖర్చు చేసిన రూ.42 లక్షలు తిరిగి ఇస్తామని చెప్పి తర్వాత మాట తప్పారని ఆ దేవాలయం మాకు అవసరం లేదు, మీరు తీసుకెళ్లి ఎక్కడైనా పెట్టుకోవాలని చెప్పడం ఎంతో ఆవేదన, బాధ కలిగిందని గ్రామస్థులు తెలిపారు. రూ.42 లక్షలు ఖర్చు చేసి నిర్మించిన దేవాలయాన్ని మధ్యలో తీసుకెళ్లమంటే.. తీసుకొని ఏమి చేయాలని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇస్కాన్ యాజమాన్యం ప్రవర్తన సరిగా లేదని, మేము నిర్మించ తలపెట్టిన శ్రీమహాలక్ష్మమ్మ దేవాలయాన్ని వదిలేస్తే కొరవ పూర్తి చేసి దేవాలయాన్ని వారికే అప్పగిస్తామని గ్రామస్థులు తెలిపారు. అలాకాని పక్షంలో ఇస్కాన్ టెంపుల్ వారు ఈ దేవాలయాన్ని వదిలి వెళ్లిపోతే మేము చేయాలనుకున్న అభివృద్ధి పనులన్నీ చేసి ఈ ప్రాంతంలో ఒక మంచి దేవాల యాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సానాపుత్తూరు రవి, చిన్నయ్య, మధుస్వామి, సర్పంచ్ ప్రకాష్, మురళీ, సునీల్, కిషోర్, దాము, సుబ్బారెడ్డి, పవన్, మల్లి, మనోహరయ్య, సుందరం, రమేష్, రామయ్య, ప్రభాకర్, మల్లికార్జున, చిట్టిబాబు, బాలు, రమణయ్యలు ఉన్నారు.

## తిరుపతి అభివృద్ధి పనులపై దృష్టి సారించండి



తిరుపతి కార్పొరేషన్, నవంబర్ 10, ప్రభాతవార్త తిరుపతి అభివృద్ధి పను లపై దృష్టి సారించి పనులను వేగవం తం చేయాలని ఇంజనీరింగ్ అధికారులను తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ డా.శిరీష, కమిషనర్ అనుపమ అంజలిలు ఆదేశించారు. గురువారం తిరుపతి నగర పాలక సంస్థ కార్యాలయంలో మున్సిపల్ కార్పొరేషన్ సూపరింటెండెంట్ ఇంజనీర్ తిరుమాలిక మోహన్, మున్సిపల్ ఇంజనీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, డిఈలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ చేపట్టిన పనులు కూడా ఆలస్యం అవుతున్నాయనే విషయాన్ని ప్రస్తావిస్తూ టెండర్లు దక్కించుకునే పనులు మొదలు పెట్టి వారికి నోటీసులు జారీ చేయాలని స్పందన లేని కాంట్రాక్టులను రద్దు చేసి తిరిగి టెండర్లు పిలవాలన్నారు. అదే విధంగా అభివృద్ధి పనులు పూర్తయిన వాటికి ప్రారంభోత్సవం ఏర్పాటులు చేయాలన్నారు. మాస్టర్ ప్లాన్ రోడ్లను మరింత వేగవంతం చేయాలని వారు కోరారు. తిరుపతి వేగవంతంగా అభివృద్ధి చెందాలంటే ప్రధానంగా మాస్టర్ ప్లాన్ రోడ్ల పనులను సరవేగంగా పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే మాస్టర్ ప్లాన్ రోడ్లను అందరి సహకారంతో పూర్తి స్థాయిలో ప్రాథమికంగా ఒక గ్రూపును తీసుకొచ్చిన విషయాన్ని మేయర్, కమిషనర్లు ప్రస్తావిస్తూ మాస్టర్ ప్లాన్ రోడ్ల విస్తరణలో రోడ్డును వెడల్పు చేసే ప్రక్రియలో స్థలం కోల్పోతున్న వారికి టిడిఆర్ బాండ్లను ఆలస్యం కాకుండా అందించి పనులను వేగవంతం చేయాలన్నారు. గొల్లవాణి గుంట స్టేడియం గురించి మాట్లాడు తూ ఆలస్యమైన పనులను త్వరగా పూర్తి చేసి స్టేడియంను ప్రజలకు అందుబాటులో తీసుకురావాలని ఆదేశించారు. కొర్లగుంట మాస్టర్ ప్లాన్ రోడ్ వెడల్పు చేసే పనులను మరింత వేగవంతం చేసి నగరాభివృద్ధికి ఇరుకు రోడ్డును వెడల్పు చేసి ప్రజలకి అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. టెండర్లు దక్కించుకుని పనులను పూర్తి చేసిన వారికి ప్రాధాన్యత ఇచ్చి ప్రోత్సహించడం జరుగుతుందనే విషయాన్ని కాంట్రాక్టర్లకు తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో ఎస్ఈ మోహన్, ఎంఈలు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, డిఈలు విజయకుమార్ రెడ్డి, సంజయ్ కుమార్, మహేష్, నరేంద్ర, దేవిక, గోమతి, టిఓ తేజస్వి, టిఎ కళావతి పాల్గొన్నారు.

## వైభవంగా ముక్కోటి ఉత్సవాలు



చంద్రగిరి, నవంబర్ 10 ప్రభాతవార్త: సూర్యప్రభ చంద్రప్రభ కాంతుల ప్రకాశంలో ఆదిదంపతులు ఆలయ మాడవీధులు విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. స్వర్ణముఖీనదీతీరాన వెలసి యున్న శ్రీ అగస్త్యేశ్వర స్వామి వారి ముక్కోటి ఉత్సవాలను ఆలయ ధర్మకర్త మొగిలి రఘురామిరెడ్డి అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆలయ ప్రధాన అర్చకులు సుబ్రమణ్యం స్వామి ఉదయం ఆనందవల్లీ సమేత అగస్త్యేశ్వర స్వామి వారికి అభిషేకం, విశేష అలంకరణ, భక్తులకు దర్శన సౌకర్యం కల్పించారు. ఉదయం 8 గంటలకు శ్రీఆనందవల్లీ సమేత అగస్త్యేశ్వర స్వామి వారి ఉత్సవమూర్తులను విశేష అలంకరణతో సూర్యప్రభ వాహనంపై అధిష్టింపజేశారు. రాత్రి 7 గంటలకు స్వామివారు అమ్మవారితో కలసి చంద్రప్రభ వాహనంపై ఆలయ మాడవీధులలో విహరిస్తూ భక్తులకు దర్శన మిచ్చారు. ముక్కోటి ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయ అర్చకులు ప్రసాద్, తపసి సత్యనారాయణ రెడ్డి, పులికంటి తేజోవతి, తపసి తిరుమల రెడ్డి, గ్రామస్థులు భక్తులకు సేవలందించారు.

## ఎస్సీ, ఎస్టీ సెల్ డిఎస్పీగా రమణ కుమార్ బాధ్యతలు



తిరుపతి క్రైం, నవంబర్ 10 ప్రభాతవార్త : ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీగా రమణ కుమార్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయన 1991 ఎస్ఐగా విధులు చేపట్టారు. 2005లో సిఐగా పదోన్నతి పొంది పలు ప్రాంతాలలో పని చేశారు. 2014లో డిఎస్పీగా పదోన్నతి పొందారు. కడప జిల్లా డిస్టిక్ పోలీస్ ట్రైనింగ్ సెంటర్లో విధులు నిర్వహిస్తూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో తిరుపతి ఎస్సీ, ఎస్టీ సెల్ డిఎస్పీగా బదిలీపై వచ్చారు. డిఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు బాధితులకు కేసు విచారణలో పూర్తి న్యాయం చేకూరుస్తామని తెలిపారు. బాధ్యతలు అనంతరం తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వర రెడ్డి, అడ్మిన్ అదనపు ఎస్పీ సుప్రజను మర్యాదపూర్వకంగా కలిశారు.

## ప్రజలను ఎరగా చేసుకుని సొమ్ము చేసుకోవాలని చూస్తే సహించేది లేదు : ఎస్పీ

తిరుపతి క్రైం, నవంబర్ 10 ప్రభాతవార్త : అమాయక ప్రజలను ఎరగా చేసుకుని సొమ్ము చేసుకోవాలని చూస్తే సహించేది లేదని జిల్లా ఎస్పీ పి. పరమేశ్వర రెడ్డి తెలిపారు. ఈ సందర్బంగా ఎస్పి మాట్లాడుతూ వరల్డ్ టి 20 క్రికెట్ మ్యాచ్‌లను ఆసరాగా తీసుకుని, అమాయక ప్రజలను, యువకులను టార్గెట్‌గా చేసుకుని ఎక్కువగా డబ్బు సంపాదించవచ్చని ఆశలు రేకెత్తించేలా క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తూ ఎంతో మంది అమాయకులను మోసం చేయాలని చూస్తే ఊరుకునేది లేదని తిరుపతి నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేసి నిఘా పెంచడం జరిగిందన్నారు. జిల్లా పోలీస్ ఉన్నతాధికారుల పర్యవేక్షణలో క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడే వారిపై నిరంతర నిఘా ఏర్పాటు చేసి, బెట్టింగ్ రాయుళ్ల భారతం పడతామన్నారు. అమాయకుల అలవాట్లను ఆసరాగా చేసుకుని ఎవరైనా డబ్బు ఆశ చూపించి క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడినా, నిర్వహించినా ఉపేక్షించబోమని ఎంతటి వారినైనా వదిలి పెట్టేది లేదన్నారు. క్రికెట్ బెట్టింగ్ నిర్వహించాలని చూస్తే ఎంతటి వారైనా వదిలి పెట్టే ప్రసక్తేలేదనిహెచ్చరించారు.

## చిత్తూరు నగరాభివృద్ధే లక్ష్యంగా పనులు : కలెక్టర్



చిత్తూరు, నవంబర్ 10 ప్రభాతవార్త: చిత్తూరు నగరాభివృద్ధి లక్ష్యంగా పనులు చేపట్టి పూర్తి చేయాలని కలెక్టర్ హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. చిత్తూరు నగర అభివృద్ధిపై కలెక్టర్ తన క్యాంపు కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ, ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ చిత్తూరు నగరాభివృద్ధిపై ఇటీవల సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నిర్వహించిన సమీక్షా సమావేశంలో పలు నివేదికలు అందించడం జరిగిందన్నారు. చిత్తూరు నగర పరిధిలో డ్రైనేజీ వ్యవస్థను చక్కదిద్దడానికి కాలనీలు, ప్రధాన కూడళ్ళలో నూతన డ్రైనేజీలు నిర్మించడం, పాడైన వాటిని మరమ్మతులు చేయడం, వర్షాలు కురిస్తే అప్పటికప్పుడు నీరు నిల్వ లేకుండా ప్రవాహంలో కలిసిపోయేలా చర్యలు తీసుకోవడానికి ప్రతిపాదనలు సమర్పించడం జరిగిందన్నారు. అలాగే చిత్తూరు నగర పరిధిలో పారిశుధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. కమీషనర్ డాక్టర్ జె.అరుణ మాట్లాడుతూ గంగినేని చెరువు, కట్టమంచి చెరువు వద్ద పచ్చదనం పెంపుకు చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్‌కు వివరించారు. 11 డివిజన్లలో ప్రత్యేక క్లాప్ వాహనాల ద్వారా ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమం చేపడుతున్నామన్నారు.

## బిందు సేద్యంకు అత్యంత ప్రాధాన్యత

**- జిల్లా ఉద్యానవన అధికారి మధుసూధన్‌రెడ్డి**



చిత్తూరు, నవంబర్ 10 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం ఒక చుక్క నీరు వృధా కాకుండా చేయడానికి బిందు సేద్యంకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని జిల్లా ఉద్యానవన అధికారి మధుసూధన్‌రెడ్డి పేర్కొన్నారు. చిత్తూరు మ్యాంగో భవన్‌లో గురువారం చిత్తూరు డివిజన్ ఉద్యానవనశాఖ వీఎఎలు, గ్రామ ఉద్యానవన కార్యదర్శులు, విఎస్ఎలు, రైతు భరోసా కేంద్రాల ఇన్‌ఛార్జీలతో జిల్లా ఉద్యానవనశాఖ అధికారి మధుసూధన్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో మొదటి విడతగా 9 వేల హెక్టార్ల విస్తీర్ణంలో డ్రిప్ ఇరిగేషన్‌కు అనుమతి ఇవ్వగా 14 వేల హెక్టార్ల విస్తీర్ణంకు రైతుల నుండి దరఖాస్తులు అందాయన్నారు. క్షేత్ర స్థాయిలో పరిశీలించడానికి పది రోజుల గడువు ఇవ్వడం జరిగిందన్నారు. జిల్లాలో 13 డ్రిప్ కంపెనీలు వున్నాని ఈ కంపెనీల ప్రతినిధులు రైతులకు సూచనలు, సలహాలు ఇవ్వడానికి ఎప్పుడు సిద్ధంగా వుంటారన్నారు. 5 ఎకరాలలోపు వున్న చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం సబ్సిడీ 2.18 లక్షల రూపాయల వరకు రాయితీ వుంటుందన్నారు. అలాగే 5-10 ఎకరాలు వున్న రైతులకు 70 శాతం రాయితీ వుంటుందని ఒకొక్క రైతుకు గరిష్టంగా 3.46 లక్షల రూపాయల సబ్సిడీ లభిస్తుందన్నారు. రెండవ సారి ఎవరైనా డ్రిప్ పరికరాలు పొందాలంటే ఏడు సంవత్సరాల తరువాత వారికి అనుమతి లభిస్తుందన్నారు. వెబ్ ల్యాండ్‌లో వున్న భూములకు ఈ విధానంలో దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప ఉద్యానవన అధికారి హరికృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ పాఠశాలలో ఆయమ్మే దిక్కు

**- మధ్యాహ్నానికే మూత.. పిల్లలు ఇంటికి - కానరాని అంగన్‌వాడీ సిబ్బంది**



ఓజిలి, నవంబర్ 10 ప్రభాతవార్త : అంగన్‌వాడీ సేవలను అంతంత మాత్రంగా అందిస్తూ మధ్యాహ్నానికే మూసివేసి పిల్ల లను ఇంటికి పంపిస్తున్న ఘటనలు ఓజిలి మండలంలో చోటుచేసుకుంటున్నాయి. ఓజిలిమండలంలోని ముమ్మాయిపాలెం ఎస్టీ కాలనీలో ఉన్న మినీ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం మధ్యాహ్నం 2 గంటలకే పిల్లలను ఇంటికి పంపించేసి అంగన్ వాడీ పాఠశాల గదికి తాళం వేశారు. రాష్ట్రప్రభుత్వం చంటిబిడ్డల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి వారి మానసిక ఆరోగ్య ఎదుగుదల కోసం బాలామృతం, పాలు, గుడ్డు అందిస్తోంది. అలాగే అంగన్‌వాడీ కేంద్రం గదిలో చిత్ర ప్రదర్శన, అనేక క్రీడా కార్యక్రమాలను ప్రవేశపెడుతుంటే క్షేత్రస్థాయిలో మాత్రం అందుకు భిన్నంగా కేవలం పిల్లలకు సరైన విద్యాబోధన అందించకపోవడంతో వారి మానసిక స్థితి ఎదుగుదల లేకుండా పోతోందని చిన్నారుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని అంగన్‌వాడీ కేంద్రాల్లో మెరుగైన సేవలు అందించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. దీనిపై నాయుడుపేట సీడీపీఓ ఎన్ఎన్ జ్యోతిని ఫోన్‌లో వివరణ కోరగా ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రాలను తెరిచి ఉంచి పిల్లలకు సేవలు అందించాలన్నారు.



శ్రీ పద్మావతి అమ్మవారిని గురువారం కుటుంబ సమేతంగా దర్శించుకున్న రాయలసీమ మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ రీజనల్ చైర్ పర్సన్ శైలజ చరణ్‌రెడ్డి దంపతులు

ప్రభాతవార్త, తిరుచానూరు

# నాడు-నేడు పనుల్లో అక్రమాలు

**- అధికారుల తనిఖీతో నిలిపివేసిన పనులు**
**- పాలసముద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రహరిగోడ నిర్మాణానికి బ్రేక్**



పాలసముద్రం, నవంబర్ 10 ప్రభాతవార్త: ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల రూపురేఖలు మార్చడానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నాడు-నేడు పనుల్లో అక్రమాలు పెచ్చురిల్లుతున్నాయి. పాలసముద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు నాడు-నేడు పనుల కింద మంజూరైన నిధులను కళాశాల తల్లిదండ్రుల కమిటీ సభ్యులు, సంబంధిత ఇంజనీర్, కళాశాల ప్రిన్సిపల్ కుమ్మక్కు అయి భారీగా నిధులు దిగమింగ డానికి ప్రణాళిక రచించారు. ఈ పరిస్థితుల్లో కొంతమంది బినామీ కళాశాల తల్లిదండ్రుల కమిటీ సభ్యులను ఎంపిక చేసుకొని వారి ద్వారా కళాశాలలో నాసిరకం ప్రహరిగోడ, అమ్మాయిల వాష్‌రూమ్ తదితరాలు చేపట్టాలని ప్రణాళిక రచించి వారం రోజుల క్రితం పనులు ప్రారంభించారు. అయితే కళాశాల ప్రహరిగోడ నిర్మాణం కోసం నిర్మించిన బేస్‌మెంట్ మరీ నాసిరకంగా వుండటంతో స్థానికులు స్పందించి దీనిపై కళాశాల అధ్యాపకులను నిలదీశారు. జాతీయ మానవ హక్కుల ఎపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.గురుప్రసాద్ నాసిరకం పనులను సెల్‌ఫోన్‌లో ఫోటోలు తీయించి పలు వాట్సాప్ గ్రూపుల్లో వైరల్ చేయడంతో అధికారులు స్పందించారు. ఈ మేరకు గురువారం వివిధ శాఖల అధికారులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ప్రహరిగోడ నిర్మాణ పనుల వద్దకు చేరుకొని పనులను పరిశీలించారు. జడ్పీటీసీ అన్బు, ఎంపిడిఓ విద్యావతి, తహసిల్దారు బాబు అక్కడికి చేరుకొని పనులు చేస్తున్న వారిని నాసిరకం పనులపై ప్రశ్నించారు. పనులు మరీ నాసిరకంగా వుండటంతో జడ్పీటీసీ అన్బు ఆగ్రహం వ్యక్తం చేసి తక్షణం పనులను నిలుపుదల చేయాలని ఆదేశించారు. ఇంత నాసిరకం పనులు చేపట్టడానికి అనుమతించిన ఇంజనీరింగ్, కళాశాల అధికారులకు నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాసిరకం పనులపై అధికారులు స్పందించకుంటే ఈ విషయంను డిప్యుటీ సిఎం నారాయణస్వామి దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు.

## మీ సమస్యలు చెప్పండి...పరిష్కరిస్తా!-ప్రజలతో టిడిపి



తిరుపతి, నవంబర్ 10ప్రభాతవార్త: ఓటరు జాబితాలో పేరు లేకున్నా, జాబితా పరిశీలనతో బాటు పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం తదితరాలు చేపట్టి, మీకు ఏదేని సమస్యలున్నా చెబితే తనవంతు పరిష్కరిస్తానని మాజీ ఎమ్మెల్యే ఎం.సుగుణమ్మ ప్రజలకు హామీ ఇచ్చారు. గురువారం సాయంత్రం 1వ డివిజన్‌లోని క్లస్టర్ 5కు సంబం ధించి అక్కారాంపల్లి రాముల వారిగుడి వద్ద తిరుపతి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సుగుణమ్మ, నగర పార్టీ అధ్యక్షుడు వట్టికుంట శంకరనారాయణ, ప్రధాన కార్యదర్శి మహేష్ యాదవ్, పార్లమెంట్ కమిటీ ఉపాధ్యక్షుడు మునిశేఖర్ రాయల్, 1వ వార్డు అధ్యక్షుడు వెంకటేష్, బూత్ ఇన్‌చార్జితో కలసి ఆమె డివిజన్‌లో పలు అంశాలపై చర్చించారు. ప్రజలకు ఏ సమస్యలున్నా తాను ముందుండి పరిష్కరించేందుకు చూస్తానని అన్నారు.


వార్త

ప్రభాతవార్తకు విలేకరులు కావలెను

తెలుగు దిన పత్రికా రంగంలో అందరి మన్ననలు పొంది పాఠకుల హృదయాలను దోచుకున్న వార్త దిన పత్రిక నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకులు కావలెను.

కావలసిన సెంటర్లు

ఈ కేంద్రాల్లో పనిచేయుటకు విలేకర్లు కావలెను.
ఎస్.ఆర్.పురం, చిత్తూరు టౌన్, గూడూరు రూరల్, గూడూరు టౌన్, చిట్టమూరు, డక్కిలి, తిరుపతినగరంలోని పలు ప్రాంతాలు, తిరుపతి కలెక్టరేట్, ఏర్పేడు, పిచ్చాటూరు, పుంగనూరు రూరల్,

మీ పూర్తి బయోడేటాతో తేది : 14.11.2022లోపు ఈ క్రింది అడ్రస్సును సంప్రదించగలరు.

వార్త కార్యాలయం, మూడవ మైలురాయి, రేణిగుంటరోడ్డు, తిరుపతి. సెల్: 9848131880